87

ధారావాహిక



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** సాధారణ పౌరుడిగా వెలనాడు వీధుల్లో సంచరిస్తున్నాడు జాయపుడు. తన రాజ్యంలోని ప్రముఖ దేవాలయాల వద్దే కాదు, అతిచిన్న గ్రామాలలో కూడా ఏదో ఒక నృత్త ప్రదర్శన జరుగుతుండటం జాయపుణ్ని ఆనందపరచింది. ఓనాడు ఓ గ్రామచావడి వద్ద మరేదో నాట్య ప్రదర్శన జరుగుతున్నది. ఇవన్నీ వీధి ప్రదర్శనలు. దేశీ నాట్యాలతో, దేశీ పాటలతో, దేశీ సంగీతంతో కలగూరగంప ప్రదర్శనలు.

ప్రదర్శన ప్రారంభంగా వాద్య పలకరింపు.. ఒకరిద్దరు కళాకారులు కనిపించగానే గ్రామీణులు కళ్లు ఇంతింత చేసుకుని ఆశ్చర్యంగా చూడసాగారు. ఉన్నంతలో ఏవేవో దుస్తులు.. కొద్ది ముఖ లేపనాలతో విచిత్రంగా కనిపిస్తున్న కళాకారులు.. ఓ తీగవాద్యం మోగగానే గొంతు సవరించుకుని పాడటం మొదలెట్టారు.

**"అయివోద్ది (అయోధ్య) పట్నానా అది వరి సావిడీ**
**లవ కుమారా వినిమన్నా కుశల కుమారా**
**సావిడి ఎనకాల సాకలోళ్ల ఇళ్లమ్మా ॥లవ॥"..**

సీతమ్మ వనవాసం. ప్రధాన గాయకుడు, గాయని కలిసి పాడుతుండగా.. పక్కన వంతలు లాంటి గాయక బృందం వారితో గొంతు కలుపుతూ కథ చెబుతున్నారు. తదనుగుణంగా ముందు పాత్రధారులు తమతమ పాత్రలకు అనుగుణంగా నాట్యమాడుతూ మధ్య మధ్య సంభాషణలు పలుకుతున్నారు.

పామరులు సీతమ్మ కష్టాలకు కన్నీరు మున్నీరవుతున్నారు. కానీ, నాట్యకళా కోవిదుడు జాయపుడు గతంలో లాగా పూర్తిగా అందులో లీనం కాలేకపోతున్నాడు. నాట్య విద్యార్థిగా దేశీ, మార్గీ నాట్య సంప్రదాయాలను చదివినవాడు కావడంతో.. ఈ ప్రదర్శనలో లీనమవడంకన్నా పరిశీలించడం ఎక్కువైంది.

చిన్ననాటి నుంచి అనుమకొండలో ఏది చూసినా 'అదేంటి? ఇదేంటి?' అని అమాయకంగా అడిగేవాడు. చుట్టూ ఉన్న ప్రతిభావంతులైన మిత్రుల్లో ఎవరో ఒకరు వివరించి చెప్పేవారు. గురుకులంలో ఉన్నా, వేశ్యాగృహంలో ఉన్నా.. గురువులను, నీలాంబ అక్కను ఇలాగే ప్రశ్నించేవాడు.

పక్కన కూర్చున్న వ్యక్తిని అడిగాడు యధాలాపంగా.

"ఈ ప్రదర్శనను ఏమంటారు?".

"ఇది యక్షగానం. ఈళ్లు యక్షులు. ఈళ్లు ఆడే పాడే వాటిని యక్షగానాలు అంటారు".

"యక్షులంటే.. అప్సరసలు! యక్ష గంధర్వ కిన్నెర"..

"అదేదో నాకూ తెలవదు గానీ, ఆంధ్రప్రాంతంలో ఆదిమ గణాలు మూడు. నాగులు, యక్షులు, ద్రవిడులు. వీళ్లలో యక్షులు భట్టిప్రోలు ప్రాంతం అంటే అదిగదిగో అక్కడ.. కృష్ణమ్మకు అద్దరి.. ఆళ్ల గానాలు, నాట్యాలను యక్షగానాలు అంటార్లే.." అన్నాడా పక్కవాడు.

యక్షుల లేదా జక్కుల కళ.. దక్షిణాది నాట్య సంప్రదాయమంటూ భరతముని నాట్యశాస్త్రంలో పేర్కొన్నట్లు జాయపునికి గుర్తొచ్చింది. పక్కకు చూశాడు. అప్పుడే ఆ పక్కవాడూ జాయపుణ్ని చూశాడు. జాయపుడు వెళ్లిన ప్రతి ప్రదర్శన వద్దా అతను కనిపిస్తున్నాడు. జాయపుడు ఏదో అడగబోయాడు. ఆ గోలలో వినిపించలేదు. ఇద్దరూ లేచి జనాన్ని తోసుకుని ప్రదర్శన ఆవలకు వెళ్లారు. జాయపుడు అడుగుదామనుకున్న ప్రశ్న.. అతనే అడిగాడు.

"నువ్వేంది.. నేనెళ్లిన పెతి నాట్టెం కాడా కనపడతున్నావ్.. ఏందీ కత??".

"నేనూ అదే అడుగుదామనుకుంటున్నా. నేను వెళ్లిన చోటుకల్లా నువ్వూ హాజరవుతున్నావ్.. ఏమిటి కథ?".

అప్పుడు ఒకరినొకరు పరిశీలనగా చూసుకున్నారు. సమవయస్కుడు. రూపురేఖలూ బాగున్నాయి. అతనొక నాట్యకారుడో, సాహిత్యకారుడో కావచ్చని జాయపుడు గుర్తించాడు. అతనూ అలాగే గుర్తించినట్లు రెప్పలు పైకెత్తి, ఆశ్చర్యం ప్రకటించి అన్నాడు జాయపునితో..

"నువ్వు.. తమరూ..?!".

"నేనొక నాట్యాచార్యుడినిలే! అనుమకొండ నుంచి బంధువుల ఇంటికి తలగడదీవి వచ్చాను. తమరో?".

అప్పటివరకూ ఆధిపత్యపు ధోరణితో వెటకారం దట్టించి.. వెలనాడు గ్రామ్యంలో మాట్లాడే పెళుసు మాటలు తగ్గించి, సాధారణ ధోరణిలోకి వచ్చాడతను.

"నేను.. పరాశరుడు. 'పరాశరదాసు' నా పేరు" అని చెప్పాడు.

"నా పేరు జగన్నాథుడు.." తడుముకోకుండా అబద్ధం చెప్పేశాడు జాయపుడు.